# పరిచయం

"ఊఁ త్వరగా ఎక్కాలి"

దిగేవాళ్ళను ఆక్షేపిస్తూ, ఎక్కే వాళ్ళను శపిస్తూ వీలయినంత ఎక్కువ స్థానాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు అంతకు ముందునించే ప్రయాణం చేస్తున్న వాళ్ళు. పాసింజర్ తెనాలి స్టేషన్‌లో ఆగింది.

చంకలో పసిబిడ్డను ఎత్తుకొని, చేతిలో సూట్ కేసుతో దిగటానికి ప్రయత్నిస్తూ, దిగలేక, ఎవరైనా బిడ్డను అందుకుంటారేమోనని ఆశగా ఎక్కడానికి ప్రయత్నించే వాళ్ళ వైపు చూస్తోంది సావిత్రి.

రామారావు భార్య ఆమెను చూసినా చూడక పట్టించుకోనట్టు ఆమెను తోసుకుంటూ రైలు ఎక్కింది. అతి ప్రయత్నం మీద చాచిన రామారావు చేతుల్లోకి బిడ్డను అందించింది సావిత్రి.

బిడ్డను అందుకుంటూ థాంక్స్ చెప్పింది సావిత్రి.

"ఫర్వాలేదండీ!" అంటూ ఆగి ఆమె ముఖంలోకి చూశాడు.

"మీారా" అతన్ని చూస్తూ ఆశ్చర్యంగా అడిగింది సావిత్రి.

"సావిత్రి!" అని అతను అంటూవుండగానే రైలు కూతవేసింది.

"త్వరగా ఎక్కండి!" చురుగ్గా అన్నది రామారావు భార్య.

రామారావు ఏదో అనబోయి "ఎక్కరేం! బండి కదులుతుంటేనూ!" భార్య హెచ్చరికతో గబుక్కున వెళ్ళి బండిఎక్కాడు. బండి అప్పటికే కదిలింది.

గేట్లో నిల్చున్న రామారావు కేసి చెయ్యి ఊపింది నవ్వుతూ సావిత్రి.

"వచ్చి కూర్చోండి!" చిరాగ్గా అన్నది రామారావు భార్య సుధ.

రామారావు యాంత్రికంగా వచ్చి భార్య ప్రక్కన కూర్చున్నాడు.

శర వేగంతో రైలు ముందుకు దూసుకు పోతూంది. రైలుకట్ట ప్రక్కగా వున్న చెట్లు వెనక్కు పరిగెత్తుతున్నాయి. స్లీపర్స్ మీాద వున్న రాళ్ళు ఎగిరెగిరి పడుతున్నాయి రైలు వేగానికి. స్మృతిపేటిక తెరుచుకుంది. కాల ప్రవాహంలో పేరుకు పోయి గడ్డ గట్టిన ఒకానొక అనుభవం ముందు కొచ్చింది.

"ఏమిటా పరధ్యానం? ఎవరావిడ?" చురుగ్గా భర్త హృదయాన్ని ఎక్సరే తీస్తున్నట్లు చూస్తూ అడిగింది సుధ.

"ఇంటికి వెళ్ళింతర్వాత చెప్తాలే!" అన్నాడు రామారావు. సుధ మూతి సున్నా చుట్టి కూర్చుంది.

"ఈ ఆడవాళ్ళకు అన్నీ అనుమానాలే" మనసులోనే అనుకున్నాడు రామారావు.

... ... ...

"అసలామె ఎవరండీ! ఏ ఊరు! మీకు తెలుసా!" రామారావు కాళ్ళకింద దిండు లాక్కుని తలక్రింద వేసుకుంటూ అడిగింది సుధ.

"అప్పుడే మర్చిపోలేదన్నమాట!"

"ఇష్టం లేకపోతే చెప్పకండి!" ముఖం గోడవైపుకు తిప్పుకొని పడుకుంది.

"ఇంతలోనే కోపం! చెప్తాను! పూర్తిగా వినాలిమరి! మధ్యలో ఆవలిస్తే చెప్పను!" నడుంమీద చెయ్యివేసి తనవైపు భార్యను తిప్పుకుంటూ అన్నాడు రామారావు.

"ఊ హు! పెద్ద! చెప్పండి!" అన్నది సుధ.

"అయితే విను! కాని ఒక షరతు!"

"ఏమిటి!"

"మధ్యలో తుంటి ప్రశ్నలు వెయ్యకూడదు."

"అబ్బ! చెప్పండీ! మరీ వేదాంతానూ...!"

... ... ...

"నేను మద్రాసులో క్రిస్టియన్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్న రోజులు. అప్రెంటీస్ చెయ్యా

డానికి వచ్చిన సుబ్బారావు మా రూంలో వుంటూ వుండే వాడు.

అప్పుడే ఒక తమాషా జరిగింది.

నేను మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో వాల్తేర పాసింజరు కోసం ఎదురుచూస్తున్నాను. రెండు గంటల లేటు! ఛా! ఎప్పుడూ ఈ రైళ్ళు ఇంతే మనం వెళ్ళేప్పుడూ. మన వాళ్ళెవరైనా వస్తున్నప్పుడే ఆలస్యంగా వస్తాయి.

మా సుబ్బారావు భార్య ఆ రైల్లో వస్తుంది! వాడికి వారం రోజులుగా జ్వరం. జనరల్ ఆసుపత్రిలో స్పెషల్ వార్డులో చేర్పించాం.

టైఫాయిడ్ అని మరో పదిహేను రోజులన్నా ఆసుపత్రిలో వుండాల్సి వస్తుందని డాక్టరు చెప్పారు. ఆసుపత్రి దగ్గిర వుండడానికి ఎవరూ లేరు. కాకినాడలో పుట్టింట్లో వున్న భార్యను రమ్మని ఉత్తరం రాశాడు. ఆదివారం ఉదయం బయలుదేరి పాసింజరులో వస్తున్నానని సమాధానం వచ్చింది ఆమెనుంచి.

మావాడు ఎప్పుడూ పెళ్ళాం గురించి చెపుతూ వుండే వాడు. కాని నేను ఆమెను చూడలేదు. నేను చెయ్యలేని వాటిల్లో (ఆ రోజుల్లో) కొత్త ఆడవాళ్ళతో మాట్లాడటం. నన్ను స్టేషన్‌కు వెళ్ళి రిసీవ్ చేసుకోమన్నాడు. బయలు దేరాను తప్పనిసరై!

నన్ను నేనే పరిచయం చేసుకోవాలి ఎలా మాట్లాడాలో రిహార్సల్ వేసుకుంటూ ప్లాటుఫారం మీద పచార్లు చెయ్యసాగాను.

బండివస్తూంది. ప్లాటుఫారం మీద కూలీలంతా హడావిడిగా పరిగెత్తుతున్నారు.

పొట్టనిండా పొర్లిపోయే జనంతో బండివచ్చి స్టేషన్లో ఆగింది.

వరసగా పెట్టెలు చూసుకుంటూ వస్తున్నా. గార్డు పెట్టెపక్కన వున్న లేడీస్ కంపార్టుమెంటు ముందు చిన్న పెట్టె, హోల్డాల్‌తో సన్నగా, ఎర్రగా ముఖంమీద పడుతున్న ముంగురులు సర్దుకుంటూ నుంచునివుంది ఓ ఇరవై ఇరవై రెండేళ్ళ యువతి ఎవరినో ఏమో ఆదుర్దాగా ఎదురు చూస్తూ.

"ఏమండీ! సుబ్బారావుగారి భార్య మీరేనా?" ధైర్యంగా ముందుకెళ్లి అడిగాను.

ఆశ్చర్యంగా నా ముఖంలోకి చూస్తూ "అవునండీ!" అన్నది.

"వారేరండి? స్టేషన్‌కు రాలేదా?" ఓ క్షణం ఆగి మళ్ళీ అడిగింది.

"జ్వరం తగుల్తూంటే హాస్పిటల్లో చేర్పించాం. మీకావిషయం రాశానని చెప్పాడే! మీరు వస్తున్నారు తీసుకురమ్మని నన్ను పంపించేడు." అన్నాను.

"ఎన్నాళ్ళనుండీ జ్వరం? ఏదో ఉద్యోగం దొరికిందని రమ్మని రాసేరే!" ఆమె ఆదుర్దాగా అడిగింది.

"బహుశా మీరు గాబరా పడతారని జ్వరం అని రాసి వుండడు." అన్నాను.

"ఏం జ్వరం అన్నాడు డాక్టరు!" దిక్కు మొహం వేసి అడిగింది.

"అబ్బె అదేం పెద్ద జబ్బుకాదు. వారం రోజుల్లో తగ్గిపోతుందని డాక్టరు చెప్పేడు."

ఇంతలో ఇద్దరు కూలీలు పెట్టె ఒకడు, హోల్డాల్ ఒకడు పట్టుకొని నిల్చున్నారు. బలవంతంమీద రెండూ ఒకడికే ఇచ్చి స్టేషన్ బయట పడ్డాం.

ఆసుపత్రికి నాలుగు గంటలనుంచిగాని వెళ్ళడానికి వీల్లేదు. ఇంటికి వెళ్లి భోజనం చేసి సాయంత్రం వెళ్దాం అని చెప్పి ఒక అర్ధరూపాయితో కూలివాడి పేచీ వదిలించుకొని టాక్సీ మాట్లాడి మైలాపూర్‌లో వున్న మా రూంకి వెళ్ళాం. హోటలునుంచి క్యారియరు తెప్పించాను. కొత్త కావడం చేత సిగ్గు సుబ్బారావుకు జబ్బుగా వుందని మరోవైపు బాధ, సాంబారు సాదం, అన్నీ తోడైనె ఆమె తిండికి. నా బలవంతంమీద ఏదో కాస్త తిన్నాననిపించింది.

సాయంత్రం నాలుగింటికి బయలుదేరి కాఫీ తాగి నాలుగున్నరకు ఆసుపత్రికి చేరుకున్నాం.

జైయిల్ వార్డు పక్కనేవున్న స్పెషల్ వార్డులో వాడున్న ఆరో నంబరు బెడ్ దగ్గరకు వెళ్ళాం.

బెడ్ మీద ఎర్రగా బొద్దుగా వయసులో వున్న యువతి సుబ్బారావు నొసటిమీద చెయ్యివేసి దగ్గరగా ఆనుకొని పక్కనే కూర్చుంది.

ఎవరబ్బా ఆమె? నాకు తెలియని స్నేహితులెవరూ వాడికిలేరే? బహుశా కాలేజీలో క్లాస్‌మేటు అయివుంటుందేమో? ఫూల్‌కు కామన్‌సెన్సులేదు. భార్య వస్తుందని తెలిసికూడా ఏమిటీవేషం!

అనుకుంటూ బెడ్ దగ్గరగా వెళ్ళి బూటుకాలు చప్పుడు చేశాను.

వెంటనే ఆమెలేచి తల దగ్గరగా నిల్చుని దిండు సర్దసాగింది. నాకు వాళ్ళిద్దరిమీదా పట్టరాని కోపం వచ్చింది.

"వెళ్ళనివాడివి ముందే చెప్పలేక పోయావా! ఇంకెవర్నయినా పంపేవాణ్నిగా స్టేషన్‌కు!" మా ఇద్దరికేసి చిరాగ్గాచూస్తూ అన్నాడు సుబ్బారావు.

టైఫాయిడ్ ఎఫెక్టయివుండాలి. లేకపోతే ఏమిటి? పీడిముఖం! పీడిమాటలూ పీడూను!

చెప్పొద్దూ నాకు చిర్రెత్తుకొచ్చింది.

"వారున్న దెక్కడండీ?" ఆ గదిలో బెడ్‌లన్నీ కళ్ళతో గాలిస్తూ ఆదుర్దాగా అడిగింది రెండడుగులు ముందుకువేసి నేను స్టేషన్‌నుంచి వెంటబెట్టుకొచ్చిన యువతి.

నాకు క్లోరోఫారం ఇచ్చినట్టయింది. చెవుల్లో "గుయ్" మంటూ ధ్వని, కత్తులు, పటకార్లు - ఆపరేషన్ సామాన్లు కన్పిస్తున్నాయ్ కళ్ళకు. నోటికి మాట పెగలక చేతితో సుబ్బారావును చూపించాను.

ఆమెముఖం రోషంతో ఎర్రబడింది. అవమానంతో కళ్ళలో గిర్రున నీరు తిరిగింది. కనుబొమ్మలు ఒకదానిచుట్టూ

వొకటి మెలి తిరగ ప్రయత్నిస్తూనాయ్. తల పక్కకు తిప్పే కుంది.

"పొద్దుటినుంచీ కాఫీకూడా తాగలేదు. స్టేషన్‌లోనే రెండు గంటలదాకా వుండి, విసుగుపుట్టి హాస్పిటల్‌కు వచ్చి నాలుగయిందాకా గేటులో పడిగాపులు పడింది. నానా అవస్థాపడి ఇంతకుముందే ఇక్కడకు చేరుకుంది." అన్నాడు గుక్కతిప్పుకోకుండా సుబ్బారావు.

"వీరినే నీకోసం స్టేషన్‌కు పంపించాను. నా ఫ్రెండ్! రామారావు." అంటూ తన మంచం పక్కనవున్న ఆమెకు పరిచయం చేశాడు సుబ్బారావు.

"కాఫీ లేక తలనొప్పికూడా వచ్చిందట. రూంకు తీసుకెళ్ళు. రేపు వుదయం రండి. మర్చేపోయాను అడగటం. వారెవరూ?" నేను తీసుకొచ్చిన యువతిగురించి ప్రశ్నించాడు

అంతవరకూ గోడకేసిచూస్తూ నిల్చున్న ఆమె గిరుక్కున తిరిగి "ఏం పెద్దమనుషులండీ మీరు? ఇదేనా మర్యాద? ఆడది వంటరిగా కనిపిస్తే మోసం చెయ్యడమేనా?" తీవ్రంగా అన్నది.

"ఏమిటండీ! ఏం జరిగిందీ!" సుబ్బారావు పొడారిన కంఠంతో తడబడుతూ అన్నాడు.

"ఇంకేం జరగాలి? జరగాల్సిందంతా జరిగింది. ఏదో మెత్తగా, మర్యాదగా ప్రవర్తిస్తే నిజమే అనుకున్నా ముందట్లో. చదువుకున్న మీలాంటివాళ్ళు చెయ్యాల్సిన

పనేనా ఇది? మద్రాసులోవున్న తెలుగువాళ్ళు తెలుగు స్త్రీలకు చూపాల్సిన మర్యాద ఇదేనా?" ఆమె చివాట్లు వేస్తుంటే నేనూ, మా సుబ్బారావూ తెల్లముఖాలు వేశాం.

"ఏమిట్రా ఈ కర్మ!" లోపల ఎవరో అడుగుతున్నట్టు అన్పించింది నాకు.

"ఏమిటిరా ఈ బుద్ధి! మొద్దల్లే నిల్చుని మాట్లాడవేం?" కొంచెం పైకి లేచి దుడుగ్గా అన్నాడు సుబ్బారావు. సుబ్బారావు భార్య మా ఇద్దర్నీ తెల్లబోయిచూస్తూ నిల్చుంది.

బుర్ర పనిచెయ్యడం లేదు. కంఠం పెగల్డం లేదు. కళ్ళకు తెల్లదుస్తులలో వున్న డాక్టర్లూ, నర్సులూ అందరూ ఒకటిగానే కన్పిస్తున్నారు.

"మా వారు మద్రాసులో ఒక ఫిలిం కంపెనీలో పని చేస్తున్నారు. మెయిల్‌లో రావల్సిందని ఉత్తరం రాశారు. మెయిల్ మిస్ అయ్యాను. ఎటూ స్టేషన్‌కు వస్తారు గనక ప్యాసింజరు చూడకుండా వెళ్తారా అనే భావంతో ప్యాసింజరులో వచ్చానండీ..." దుఃఖం అవమానం ఆమె కంఠంలో ఒకదాన్నొకటి ఒరుసుకున్నాయ్.

"అయితే మీవారు రాలేదాండీ స్టేషనుకు!" మధ్యలోనే అందుకొని అడిగాడు సుబ్బారావు.

"ఏమో మరి! దిగీదిగక ముందే వారికి జబ్బుగా వుందనీ తన్ను నా కోసం పంపించారనీ, నమ్మించి ఈ పెద్ద

మనిషి నన్నిక్కడకు తీసుకొచ్చాడు." అన్నది తీవ్రంగా ఆమె.

"క్షమించండి! ఎంతపని జరిగిందీ!" అన్నాడు సుబ్బారావు నా లాంటి స్నేహితులుండటం శిక్షగా భావిస్తున్నట్టు.

"మా సుశీల వస్తుందని స్టేషన్కు పంపేను. పొరపాటున మీరేనని తీసుకువచ్చి వుంటాడు. అన్యథా భావించకండి!" అంటూ తన భార్యను పరిచయం చేశాడు.

"మరేం ఫరవాలేదు. మా ఆవిడా, వాడూ వచ్చి మిమ్మల్ని మీ ఇంటి దగ్గర దిగబెడతారు. మీ వారిపేరు!"

"సుబ్బారావు! అందుకే పొరపాటు పడ్డాను. ఆంధ్ర దేశంలో ప్రతి పదిమందిలో ఒకడు సుబ్బారావేనాయే!" నా తప్పేం లేదన్నట్టూ, తప్పంతా పేరులోనే వున్నట్టూ అన్నాను.

సుబ్బారావు నవ్వాడు. సుశీల పైటకొంగు నోటికి అడ్డం పెట్టుకొని కిసుక్కున నవ్వింది.

"అడ్రసు ఏమిటమ్మా!" అడిగాడు సుబ్బారావు.

"త్యాగరాజనగర్. ఆ ఫిలిం కంపెనీ పేరు తెలియదండీ! కొత్తగా పెట్టారట." దాదాపు ఏడుపు గొంతుతోనే అన్నది.

"చచ్చాం పో! ఫిలింకంపెనీలకు ఫోన్ చేసినా ప్రతి కంపెనీలో ఒక సుబ్బారావైనా తేల్తాడే!?" అన్నాను మైకం వదిలి మామూలు స్థితికి వచ్చిన నేను.

"ఏడ్చావులే! ఫర్వాలేదమ్మా! దిగులు పడకు. అతని

దగ్గరకు మిమ్మల్ని చేర్చే బాధ్యత మాది." అన్నాడు సుబ్బారావు.

"మీ పేరేమిటండీ?" ఆమె చెయ్యి పట్టుకొని చొరవగా అడిగింది సుశీల.

"సావిత్రి" ప్రాణం కుదుటపడింది. వికసించిన ముఖంతో అన్నది.

"సాయంత్రం టీ నగర్ వెళ్ళి ఆ సుబ్బారావుగారు ఏ కంపెనీలో వున్నారో తెలుసుకో!" అన్నాడు మా సుబ్బారావు.

"క్షమించండి!" ఇద్దర్నీ ఉద్దేశించి అన్నాను.

"పొరపాటుకు ఎవరేం చేస్తారులెండి." ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"క్షమించండి ఆరయింది. ఇక వెళ్ళాలి." అంది నర్స

... ... ...

"క్షమించండి పదయింది." నిద్రముంచుకొస్తూవుంటే కళ్ళుమూసుకొని అన్నది సుధ రామారావుతో.

"అందుకే! ముందుగానే చెప్పాను. చివరివరకూ వినాలని?" అన్నాడు రామారావు.

"మా గొప్ప పరిచయంలేండి? ఇహపడుకోండి. నాకు నిద్దరొస్తుంది." అంటూ పక్కకు ఒత్తిగిలి పడుకుంది సుధ.

"ఈ ఆడవాళ్ళు ఎప్పుడూ ఇంతే!" గొణుక్కుంటూ పక్కకు తిరిగి పడుకున్నాడు రామారావు